ఒక రకంగా నేను నాస్తికుడ్నే. కానీ జీవితంలో ఎదురైన అనేకానేక సంఘటనలు క్రమేపీ నన్ను ఆ భావం నుండి పూర్తిగా వెనక్కి లాగేశాయి.


కరడుగట్టిన కమ్యూనిస్టులు, పరమ నాస్తికులుగా చెలామణీ అయినవారు, హేతువాదులమంటూ జబ్బ చరుచుకుంటూ తిరిగిన వాళ్ళు సైతం జీవితంలోని సంక్షోభాలకు వెరచి, ఆ అనంతుని ముందు తలవంచిన సంఘట

# వాల్జడ

నల్ని విన్నాం, చూస్తున్నాం. ఇక నేననగా ఎంత?

ఎన్నో సందర్భాల్లో జీవితం నా చేజారిపోతుందనుకుంటున్న క్షణాల్లో ఏదో ఒక విధంగా మళ్ళీ నిలదొక్కుకోవడం యాదృచ్ఛికమని నేననుకోలేదు. నా సర్వశక్తులూ జీరో స్థాయికి చేరిన క్షణంలో ఏదో అతీంద్రియ శక్తి నన్నాదుకోవడం నాకు స్వానుభవైకవేద్యమైంది.

నా బాల్యంలో రక్తవిరోచనాల వల్ల ఇంక నేను దక్కననుకునే నిర్ణయానికొచ్చేశారట అమ్మానాన్నా. వాళ్ళ చేతనైన వైద్యమంతా చేయించాక ఆశ వదులుకున్నారు. పురిట్లోనే నాకంటే పెద్దోడు పోయినా, మరో కొడుకున్నా పేగు బంధాన్ని కాదనుకునే తల్లిదండ్రులెక్కడా ఉండరు. వాళ్ళు మూడు సంవత్సరాల నా బాధ చూళ్ళేక ఆ నిర్ణయానికొచ్చారు.




కానీ... విచిత్రంగా ఆ పరిస్థితుల్లో ఎవరో ఓ అనామకుడు చిన్న చిట్కా చెప్పాడట. వారం రోజుల్లో గుణం కనిపించింది. నెలరోజుల్లో మామూలు స్థితికొచ్చానట. సంవత్సరం తర్వాత నా స్వరూపమే మారిపోయింది.

అలాంటిదే మా సంతానానికి సంబంధించి...

పెళ్ళైన ఆరేళ్ళ దాకా సంతానం కల్గలేదు. మన సమాజంలో సంతాన హీనత ఎన్ని రకాల అపోహలకు కారణమవుతుందో నేను చెప్పనవసరం లేదు. కానీ, అదృష్టవశాత్తూ రాగిణికీ నాకూ మధ్య ఉన్న అన్యోన్యత మా దాంపత్యాన్ని విచ్ఛిన్నం కాకుండా కాపాడింది. పరీక్షల అనంతరం, డాక్టర్లు ట్రీట్‌మెంట్ సైతం సఫలం కాక పెదవి విరిచేసి, దత్తపుత్రునితో సరిపెట్టుకోమ్మంటే.. ఆ పరిస్థితిని ఎలా తట్టుకోవాలో అర్థంకాక ఆందోళన పడుతున్న సమయంలో--

ఓ మారు మూల గ్రామంలోని ఓ వైద్యుడ్ని కలిశాం. రెండు నెలలు ఏదో ఔషధం ఇచ్చాడు. అపురూపమైన సంతానం. ఒక్కరుకాదు--మేము కాదనుకునే దాకా సంతానం కల్గడం..నమ్మశక్యంగాని విషయం.

పై రెండు సందర్భాల్లోనూ భారతీయ వైద్యం లేదా ఆయుర్వేదం గొప్పతనమే తప్ప, భగవంతుడి ప్రమేయమేముంది? అని పెదవి విరిచేవారూ ఉండవచ్చు కాని..

దోరవేటి

హైదరాబాదు వెళ్ళాలి. ఆలస్యమైపోయింది. ట్రెయిన్ ప్లాట్‌ఫామ్ మీద ఆగి ఉంది. గార్డు విజిల్ ఊదాడు. నేను ఇంకా వంద గజాల దూరంలో ఉన్నాను. పాపనెత్తుకొని పరుగెత్తుతున్నాను. నా వెంట శ్రీమతి. ఓ పిచ్చోడు మమ్మల్ని స్టేషన్ బయట అడ్డుకున్నాడు. నేనెంత ప్రయత్నించినా వాడ్నుంచి తప్పించుకుని ముందుకెళ్ళలేక పోయాం. ఆ పిచ్చివాడ్నీ, మా దురదృష్టాన్ని తిట్టుకుంటూ, ఓ అరగంట తర్వాత బస్సులో వెళ్ళి, ఆ రాత్రికి బస్సులోనే వచ్చాం. మరుసట్రోజు ఉదయం మేం వెళ్ళాలనుకున్న ట్రెయిన్ యాక్సిడెంట్‌కు గురైన విషయం తెలిసింది. ఆ పిచ్చివాడి కోసం ఎంత గాలించినా, ఈనాటికీ సఫలం కాలేకపోయాను.

ఇంతకూ ఇప్పుడిదంతా ఎందుకంటే... ఉపాధ్యాయుల ట్రాన్స్‌ఫర్‌లకు పట్టుకున్న గ్రహణం వీడిపోదని తెలిసి, నాకు అనుకూలమైన ప్లేస్‌కి.. అంటే మా ఆవిడకూ నాకూ ఒకే చోటికి ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాలింక లేవని, కష్టాలను సహించేందుకు కమిట్ అయిపోయిన ఈ సందర్భంలో, వేర్వేరుగా ఉన్న మేము ఒక్కటిగా ఉండే ట్రాన్స్‌ఫర్ వరం అనుకోకుండా మళ్ళీ దక్కడం- ఆ భగవంతుని మీద అచంచలమైన విశ్వాసాన్ని కల్గజేసింది.

అలాగని గుడ్డిగా దేవుడ్ని నమ్ముకొని మొక్కుబడుల్తో కాలక్షేపం చేసే రకం కాదు నేను. ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకొని నా పని నేను సమర్ధవంతంగా చేసుకుంటూ పోవడానికి అలవాటు పడ్డవాడ్ని. కోర్కెలు తీర్చుకునేందుకు లంచాలు దేవునికి ఎరజూపినట్లు ముడుపులు చెల్లించడానికి బద్ధవ్యతిరేకిని.



ఎనీ హౌ, నాకు ట్రాన్స్‌ఫరైంది. ఆర్నెల్ల కఠోర శిక్ష... వారానికొక్కసారి మాత్రమే భార్యాబిడ్డల్ని చూసుకునే దురవస్థ తప్పింది. తప్పదనుకున్న బాధను తప్పించిన ఆ సర్వశక్తిమంతుడైన భగవంతునికి మనసులోనే కృతజ్ఞతలు సమర్పించుకున్నాను. మళ్ళీ పిల్లల్తో కలిసి జీవితం మధుర క్షణాలు గుర్తొచ్చేసరికి మనసుకు గిలిగింతలు కలిగాయి.

రాగిణి గుర్తుకు రాగానే ముందుగా గుర్తొచ్చేది తన 'నాగిని' లాంటి వాల్జడ. ఆ జడంటే నాకెంత ఇష్టమో చెప్పలేను.

కాకతాళీయంగా పెళ్ళికి ముందు రామచంద్ర అప్పారావు 'వాల్జడ' ఖండిక చదివాను. 'మా ఆవిడకు అటువంటి జడ ఉంటే ఎంత బావుండునో' అంటూ కలలుగన్నాను. కాని, ఆధునిక కాలంలో మూరెడు జుట్టుంటేనే మహాకష్టమనుకుంటూ జానెడు చేసుకొని కాలక్షేపం చేయడానికలవాటు పడ్డారీ ఆడవాళ్ళు. ఇహ నేనా కోరిక పెంచుకోవడం అర్థంలేనిదని కమిట్ అయిపోయిన క్షణాల్లో- పెళ్ళి చూపుల్లో రాగిణి జడ చూసే ఆకర్షితుడనయ్యాననడం ఆశ్చర్యకరమైన సంగతి కాదు.

పెళ్లయిన కొత్తలో 'ఏకాంత వేళల్లో' ఏకాంత సేవల్లో మా యిద్దరికీ ఈ జడ విషయంలోనే ముళ్ళు పడేది. తనకేమో చక్కగా తలంటుకొని జుట్టు విరబోసుకుని, ఆ నీలికేశాలలో నా తలను కప్పేయాలని, చిక్కని వెల్తురులో ఆమె శిరోజాలు మా చెక్కిళ్ళను పల్చని చీకటిలో దాచేస్తే... గుసగుసలాడుకోవాలనీ ఉండేది.

కాని, నాకు మాత్రం బారెడు పొడుగున్న ఆ జడను మా ఇద్దరి మధ్యా వేసుకొని, అది కలిగించే వింత అనుభూతికి పులకించాలని, దగ్గరికి చేరినపుడు ఆ జడనొక్కసారి నా గొంతుకూ, వీపునకూ చుట్టుకోవాలనీ, కొసకు కట్టుకున్న కుచ్చిళ్ళతో తన బుగ్గల మీద నేను, నా బుగ్గల మీద తానూ తాటిస్తూ చక్కిలిగింతలు పెట్టాలని ఆశగా ఉండేది. పురుషాధిక్య ప్రపంచంలో నా కోరికలు నెరవేరిన సందర్భాలే ఎక్కువ. రాన్రానూ తన కోరికల్ని నా కోసం త్యాగం చేసిందని మాత్రం చెప్పగలను. ఒకరికోసం ఒకరు చేసే ఇలాంటి చిన్న చిన్న త్యాగాలే దాంపత్య జీవితాన్ని నందనవనం చేస్తాయన్న సత్యం ఆలస్యంగా అవగతమైంది.

మొత్తం మీద నాకు నచ్చిన రాగిణి వాల్జడ, మల్లెల చెండు నాకు సౌఖ్యాన్నే గాక తనకూ మంచి గుర్తింపునే తెచ్చిపెట్టాయని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను.

## లౌక్యం తెలిసిన గజాలా

**లేటెస్ట్ గ్లామర్ స్టార్ గజాలాకి ఇప్పుడు డజనుకి పైగా సినిమాలున్నాయిట. 'నాలో వున్న ప్రేమ' సినిమా పెద్దగా ఆడకపోయినా, 'స్టూడెంట్ నెం.1' చిత్రం మాత్రం హిట్ కావడం, తాజాగా 'ఓ చినదానా' కూడా సక్సెస్ కావడంతో ఆమె దశ తిరిగిపోయింది.**

**'నా చిత్రాలు ఘన విజయం సాధించినందుకు అభిమానులు కురిపిస్తున్న అభినందనలన్నీ ఆయా చిత్ర నిర్మాతా దర్శకులకే చెందుతాయి' అంటూ సిన్సియర్‌గా చెప్పేస్తోంది గజాలా. ఆమాత్రం లౌక్యం లేనిదే ఈరోజుల్లో కుదరదనే సంగతి గజాలా గ్రహించిందన్నమాట.**

**-శ్వేత**

హైదరాబాద్‌లో బస్సు దిగగానే బుట్టెడు మల్లెపూలు తీసుకోవాలనుకున్న నా ఆలోచనను బలవంతంగా అణచుకొని, నాలుగు మూరలకు కుదించుకున్నాను. ఎందుకంటే మాది కొత్తకాపురం కాదు. పైగా వెళ్తున్నది అత్తారింటికి. అపార్థం చేసుకునే అవకాశమివ్వకూడదని..

ఇల్లు చేరేసరికి రాత్రి పదిన్నరైంది. ఈపాటికింకా మా అత్తయ్యా, ఆమె కోడలు, మా ఆవిడా టీవీలో ఎడతెగని సీరియల్ చూస్తూ, కన్నీళ్ళతో, పరామర్శల్తో కాలక్షేపం చేస్తూంటారు- అనుకుంటూ తలుపు తట్టిన నాకు మొదటిసారి నిరాశెదురైంది.

ఇంట్లో ఏ అలికిడీ లేదు.

ఏదో అనుమానం.

అంతలోనే భయం.

రెండుమూడుసార్లు తలుపు తడితేగాని ఫలితం దక్కలేదు.

ఆవలిస్తూ తలుపుతీ

సింది- మా అత్తయ్య

జనరల్‌గా మా ఆవిడే తలుపు తీస్తుంది, అదే ఊహించుకుంటూ- ఏదో చేయాలని ప్రిపేరైన నేను ఎదురుగా అత్తగార్ని చూసి, నన్ను నేను నిగ్రహించుకోవడం గగనమైపోయింది.

''రాగిణి....'' అర్థోక్తిలో ఆగిపోయాను.

''పడుకుంది బాబూ!'' గుర్తు తెచ్చుకున్నట్టు మళ్ళీ అంది. ''తొమ్మిందిటి వరకూ ఎదురు చూసింది. అసలే ప్రయాణంలో బాగా అలసిపోయింది. పిల్లలు కూడా ఎనిమిదింటికే నిద్రపోయారు..''

అప్పుడు గుర్తొచ్చింది . నాకు ట్రాన్స్‌ఫర్ కౌన్సిలింగ్ అయిన విషయం తెలియగానే అంతా తిరుపతి వెళ్ళిన సంగతి. తనూ వెళ్ళాల్సిన వాడే కాని, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ తీసుకొనిగాని, తానున్న ప్రదేశం నుండి కదలరాదని నిర్ణయించుకోవడం వల్ల ఇలా ఆలస్యంగా..

ఒకింత నిరుత్సాహం నన్నావరించింది. అయినా పరిస్థితిని జీర్ణం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ బెడ్‌రూంలోకి ప్రవేశించాను- స్నానాదికాలు కానిచ్చి.

పిల్లలిద్దరూ రాగిణిని చెరోపక్క చుట్టుకొని పడుకున్నారు. వాళ్ళను విడదీయడానికి మనసొప్పలేదు. డబుల్ కాట్‌లో ఇంకా చాలా ఖాళీ స్థలముంది. నిశ్శబ్దంగా ఓ పక్కన పడుకున్నాను.

చలి బాగా ఎక్కువగా ఉన్నట్టుంది. స్వెట్టర్ వేసుకొని తలకు మప్లర్ కట్టుకుంది రాగిణి. అమాయకంగా నిద్రపోతున్న తనను డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక పిల్లల నుదుటి మీద, తన నుదుటిమీదా ముద్దుపెట్టుకొని మెల్లగా నాకు నిర్దేశించుకున్న స్థలంలో పడుకున్నాను. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. రాగిణి స్పర్శతో మళ్ళీ మెలకువ వచ్చింది.

''ఎన్నింటికొచ్చారు? నన్ను లేపలేదేంటి?'' నాలో చలనాన్ని కనిపెట్టి, అనురాగంలో నిష్ఠూరం మెలిపెట్టి, నన్నల్లుకుపోతూ అంది రాగిణి.

బెడ్‌లైట్ ఆర్పేసి ఉండటం వల్ల టైమ్ తెలుసుకునే అవకాశం లేదు. సాధారణంగా పిల్లలు మాతోపాటు పడుకొనే పరిస్థితులు తప్పనప్పుడు బెడ్‌లైట్ కూడా ఆర్పేసి మేం 'మాట్లాడుకోవటం' పరిపాటి.

''ఆ! నిన్ను లేపితే, లేచే స్థితిలో ఉన్నావేంటి?'' తన నిష్ఠూరాన్ని తన వైపే తిప్పికొడుతూ మరింతగా హత్తుకున్నాన్నేను.

'అర్థమైందిలే' అన్నట్టు బుగ్గన 'ముద్దు'గా పెదాలానించింది రాగిణి.

నేను తెచ్చిన మల్లెపూల పొట్లం కోసం వెతికాను. అతి ప్రయత్నం మీద దొరికింది.

''నాగినీ! ఓసారి వెనక్కి తిరుగు!'' గుసగుసగా అంటూ పొట్లం విప్పాను.

తను తిరగలేదు.

ముందుగా స్వెట్టర్ విప్పాను.

ఆపై తలకున్న మప్లర్ ముడి విప్పాను.


జడ కోసం వెతికి ఉలిక్కిపడ్డాను. చెదిరిన నిద్రమత్తు అలుముకున్న అనుమానం నన్ను అయోమయంలోకి నెడుతుంటే- బెడ్‌లైట్ వేశాను.

లక్కపిడతలా నన్ను వెక్కిరిస్తున్న రాగిణి గుండు చూసి ఒక్కకేక పెట్టాను.

అరగంట తర్వాత...

''నాకు తెలుసండీ మీరు బాధపడ్తారని, కాని... మీ ఎడబాటుకంటే నాకీ జడ ముఖ్యంకాదు. మీకు ట్రాన్స్‌ఫరైతే తలనీలాలు సమర్పించుకుంటానని వెంకన్నకు మొక్కుకున్నాను.'' అంటున్న శ్రీమతి మాటలు- 'దేవుడున్నా'డని మరోసారి ఋజువు చేస్తున్నట్లనిపించసాగాయి.

☆



డా.కంభంపాటి
స్వయం ప్రకాష్
ఎం.డి.(ఆయుర్వేద)
సెక్సాలజిస్ట్ & ఇన్‌ఫర్టిలిటీ స్పెషలిస్ట్
(అమెరికాలో ప్రొ.జాన్‌మనీ వద్ద శిక్షణ పొందారు )
ప్రతి బుధవారం
కేరాఫ్ కల్పాఫార్మా,41-3-23,కృష్ణలంక,
బియ్యం కొట్ల బజార్ సెంటర్ వద్ద,విజయవాడ,
ఫోన్:521761 (ఉదయం 9 నుంచి రాత్రి 9గంటల వరకు)
హైదరాబాద్ క్లినిక్ + ఉత్తరాలు రాయాల్సిన చిరునామా:-
118-అమృతవిల్లే, యశోదాహాస్పటల్‌ఎదురుగా, రాజ్‌భవన్ రోడ్,
సోమాజీగూడ,హైదరాబాద్-82 (గురు, శుక్ర,శని, ఆది,సోమ, మంగళ వారాలు)
ఫోన్: 3322884,3328854 సెల్:98490-29947
E-Mail: swayamk @ hd2.vsnl.net.in aducation@hotmail.com
Aడ్యుకేషన్ పుస్తకం వెల రూ.75/- మగవారిలో సంతానలేమి పుస్తకం వెల రూ.27/- విడుదలయ్యాయి. కావలసినవారు పై అడ్రసుకి M.O.చెయ్యండి.
డాక్టర్ గారి శీర్షికలు వార్త దిన పత్రిక ఆదివారం అనుబంధంలో 'నవీన కామసూత్ర', చిత్రం సినీ వార పత్రికలో 'సృష్టి', సరాగాలులో 'దాంపత్య జీవనం'గా వస్తున్నాయి. పాఠకులూ,సలహాలు కావలసినవారు చదువగలరు.
హార్మోన్ పరీక్ష, రిజిస్కాన్ పరీక్ష లభించును.

